సాక్షి
మెదక్
గురువారం । 24 । ఏప్రిల్ । 2025



మెదక్ పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

ఉగ్రదాడి పిరికిపంద చర్య

బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్

మెదక్‌జోన్/నర్సాపూర్: జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు సృష్టించిన నరమేధం పిరికిపంద చర్యగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్ అభివర్ణించారు. బుధవారం రాత్రి మెదక్ పట్టణంలోని రామాలయం నుంచి శివాజీ విగ్రహం వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందువులపై జరుగుతున్న ఈ చర్యలతోనైనా అందరం ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు గడ్డం శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు ప్రసాద్, విజయ్, ఎంఎల్ఎన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు నర్సాపూర్‌లో విలేకరులతో మాట్లాడారు. పర్యాటకులపై ఉగ్రవాదులు విచక్షణ రహితంగా కాల్పులు జరిపి ప్రాణాలు బలి తీసుకోవడం కలిచివేసిందన్నారు. ఉగ్రవాదులను కేంద్రం విడిచిపెట్టదని, వారికి తగిన గుణపాఠం చెబుతుందని అన్నారు.

న్యూస్‌రీల్

రైతులు సహకరించాలి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీడీఎం కృష్ణతేజ, తదితరులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చే రైతులు నిర్వాహకులకు పూర్తి సహకారం అందించాలని మెదక్, సంగారెడ్డి జిల్లాల నాబార్డ్ డీడీఎం కృష్ణతేజ అన్నారు. బుధవారం మండల పరిధిలోని గౌతాపూర్‌లో రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. దళారుల నుంచి మోసపోకుండా ఉండేందుకే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా నాబార్డ్ డీడీఎం నిఖిల్‌రెడ్డి, ఎంపీడీఓ ఆనంద్, ఏఈఓ దివ్యశ్రీ, పంచాయతీ కార్యదర్శి శ్రావణి సింధూజ, రైతు ఉత్పత్తిదారుల సంఘం మండల అధ్యక్షుడు యాసిన్, నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాచీన ఆలయాల జీర్ణోద్ధరణ అభినందనీయం



మాట్లాడుతున్న మాధవానంద సరస్వతి

పెద్దశంకరంపేట(మెదక్): వందల ఏళ్ల చరిత్ర కలిగిన పురాతన రామాలయ జీర్ణోద్ధరణ అభినందనీయమని తిరుమల తిరుపతి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి, తొగిట పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామిలు అన్నారు. బుధవారం పెద్దశంకరంపేటలో శ్రీ సీతారామ చంద్రుల విగ్రహ ప్రతిష్ఠ, హనుమాన్, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొని మాట్లాడారు. భావితరాలకు ఆలయ విశిష్టతను తెలియజేయాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యేలు భూపాల్‌రెడ్డి, విజయ్‌పాల్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గుజ్జరి కనకరాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించండి

మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి

పాపన్నపేట(మెదక్): జిల్లాలో 80 శాతం వరి కోతలు ప్రారంభమైన నేపథ్యంలో అన్ని చోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేలా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వ్యవసాయ అధికారులు ఆయా గ్రామాలకు వెళ్లి ఎంత మేర వరి కోతలు జరిగాయి, అందుకు సంబంధించి కొనుగోళ్లు ఎలా జరుగుతున్నాయి అనే విషయాన్ని పరిశీలించాలన్నారు. రైతులకు అవసరమైన టార్పాలిన్లు, హమాలీలు, లారీల కొరత లేకుండా చూడాలని కోరారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి



గ్రంథాలయ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సుహాసినిరెడ్డి

రేగోడ్(మెదక్): గ్రంథాలయ భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి అన్నారు. రేగోడ్‌లో నిర్మాణ పనులను బుధవారం పరిశీలించి మాట్లాడా రు. భవనాన్ని త్వరగా పూర్తి చేసి పాఠకులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

సమ్మెను జయప్రదం చేయండి: సీఐటీయూ

మెదక్ కలెక్టరేట్: మేడేతో పాటు మే 20వ తేదీన నిర్వహించే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు చుక్క రాములు, పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని కేవల్ కిషన్ భవన్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా 139 ఏళ్ల క్రితం కార్మికులు సాగించిన సమరశీల పోరాటాల ఫలితంగానే ప్రపంచ కార్మిక వర్గానికి కొన్ని హక్కులు దక్కాయన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, జిల్లా అధ్యక్షుడు మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైవేగంగా..

చకచకా మెదక్- ఎల్కతుర్తి రోడ్డు పనులు

- జాతీయ రహదారితో మూడు జిల్లాలకు ప్రయోజనం
- రామాయంపేట అటవీ ప్రాంతంలో ఆగిన పనులు
- అటవీశాఖ నుంచి రాని అనుమతులు

మెదక్- ఎల్కతుర్తి జాతీయ రహదారి (765 డీజీ) పనులు వేగంగా జరుగుతున్నాయి. మెదక్ నుంచి సిద్దిపేట వరకు 70 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి రూ. 882 కోట్లు, సిద్దిపేట నుంచి వరంగల్ జిల్లా ఎల్కతుర్తి వరకు 64 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణానికి రూ. 578 కోట్లను కేంద్రం విడుదల చేసింది. దీంతో రెండు ప్యాకేజీల కింద పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

– రామాయంపేట(మెదక్)



రామాయంపేట వద్ద కొత్తగా నిర్మిస్తున్న రహదారి

మెదక్- ఎల్కతుర్తి జాతీయ రహదారి నిర్మాణం పూర్తయితే మెదక్, సిద్దిపేట, వరంగల్ జిల్లాలకు రవాణా వసతులు మెరుగుపడనున్నాయి. గతంలో సింగిల్ రోడ్డుగా ఉన్న సమయంలో ఎన్నో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ప్రతి రోజూ మూడు జిల్లాలకు చెందిన ప్రజలు నిత్యం వేల సంఖ్యలో ఈ రహదారిపై ప్రయాణిస్తారు. ప్రస్తుతం మెదక్- రామాయంపేట మధ్య పనులు చురుగ్గా సాగుతున్నాయి. రామాయంపేట మండల పరిధిలోని అటవీ ప్రాంతంలో రహదారి విస్తరణకు అనుమతులు రాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. ఏడాదిన్నర క్రితమే అనుమతుల కోసం కేంద్ర అటవీశాఖకు అధికారులు ప్రతిపాదనలు పంపారు. అయితే ఇప్పటివరకు అనుమతులు రాకపోవడంతో అటవీ ప్రాంతంలో నాలుగున్నర కిలోమీటర్ల మేర పనులు షురూ కాలేదు. త్వరలో మంజూరు వచ్చే అవకాశం ఉందని ఆశాఖ అధికారులు చెబుతున్నారు.

అక్కన్నపేట రైల్వేలైన్ వద్ద వంతెన నిర్మాణం

కొత్తగా నిర్మిస్తున్న మెదక్- రామాయంపేట రహదారి మధ్యలో అక్కన్నపేట రైల్వేలైన్ ఉండటంతో పనులు నెమ్మదించాయి. ఇక్కడ రైల్వేలైన్ కింది భాగం నుంచి భారీ స్థాయిలో వంతెన నిర్మించనున్నారు. లైన్‌కు ఇరువైపులా భూమిని తొలిచి లోపలి భాగం నుంచి రహదారి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే గుట్టను, భూమిని తొలిచారు. అలాగే రామాయంపేట వద్ద నుంచి బైపాస్ రోడ్డు నిర్మించనున్నారు. దీనికి సంబంధించి పనులు ఇంకా ప్రారంభం కాలేదు. స్థానిక వ్యాపారులతో పాటు భూములు కోల్పోతున్న రైతుల నిరసన, అభ్యంతరాలతో పనులు నిలిచిపోయాయి. బైపాస్ రోడ్డు వద్దని, పాత రోడ్డు మార్గంలోనే నిర్మించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, కలెక్టర్ రాహుల్‌రాజ్, జాతీయ రహదారుల శాఖ అధికారులు పలుమార్లు రైతులు, వ్యాపారులతో సమావేశాలు నిర్వహించినా కొలిక్కి రాలేదు. తాజాగా ఈనెల 22వ తేదీ నుంచి బైపాస్ రోడ్డు నిర్మాణానికి పోలీస్ బందోబస్తుతో అధికారులు సర్వే పనులు ప్రారంభించారు. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా చాలా వరకు మలుపులు తొలగిస్తున్నారు. తొనిగండ్ల వద్ద పాత రోడ్డును వదిలేసి నేరుగా కొత్త రహదారిని నిర్మించారు. దీంతో పాటు రహదారి నిర్మాణం పూర్తయిన అనంతరం అన్ని బస్టాండ్‌ల వద్ద అధునాతన బస్‌షెల్టర్లు నిర్మిస్తామని ఆశాఖ అధికారులు వెల్లడించారు. రామాయంపేట- సిద్దిపేట మార్గంలో పనులు చివరిదశకు చేరుకున్నాయని తెలిపారు.

కొత్త చట్టంతో భూ సమస్యలకు చెక్

కలెక్టర్ రాహుల్‌రాజ్

వెల్దుర్తి(తూప్రాన్)/చేగుంట/చిన్నశంకరంపేట (మెదక్): నూతన ఆర్ఓఆర్ చట్టం భూ భారతితో ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలు పరిష్కారమవుతాయని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. బుధవారం మాసాయిపేట మండల కేంద్రంలోని రైతువేదికలో భూభారతిపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతన చట్టం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించడంతో పాటు రైతుల అనుమానాలను నివృత్తి చేశారు. రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రతీ గ్రామంలో గ్రామ పరిపాలన అధికారులను త్వరితగతిన నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. పెండింగ్‌లో ఉన్న సాదా బైనామాల పరిష్కారానికి భూ భారతిలో ప్రభుత్వం అవకాశం కల్పించిందని వివరించారు. అనంతరం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించారు. స్టోర్ రూం, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో తూప్రాన్ ఆర్డీఓ జయచంద్రారెడ్డి, తహసీల్దార్ జ్ఞానజ్యోతి, ఎంపీడీఓ విఠ్ఠేశ్వర్, ఏడీఏ పుణ్యవతి, గిర్దావర్ ధన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని రైతువేదికలో కొత్త చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. చేగుంట మండలం కేంద్రంలో సైతం భూ భారతి చట్టంపై రైతులకు కలెక్టర్ అవగాహన కల్పించారు.



ఇంటర్‌లో రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించిన కృతికను అభినందిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

తూప్రాన్: ఇంటర్‌లో 468 మార్కులతో రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించిన తూప్రాన్ గీతా కళాశాల విద్యార్థిని టి. కృతికను కలెక్టర్ రాహుల్‌రాజ్, ఆర్డీఓ జయచంద్రారెడ్డి బుధవారం అభినందించారు. మాసాయిపేట మండల కేంద్రంలో భూ భారతి కార్యక్రమానికి హాజరైన కలెక్టర్‌ను కృతికతో పాటు తల్లిదండ్రులు కలిశారు. ఈసందర్భంగా విద్యార్థినిని సన్మానించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించి దేశానికి సేవ చేయాలన్నారు. విద్యార్థిని తల్లిదండ్రులతో పాటు కళాశాల యాజమాన్యం, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ మా చదువుల కోసం నాన్న ఇబ్బంది పడుతున్నారని, భవిష్యత్తులో సాఫ్ట్‌వేర్‌లో ఉద్యోగం సాధించి నాన్న కష్టంలో పాలుపంచుకుంటానని కృతిక పేర్కొంది.



కాబోయే వధూవరులను ఆశీర్వదిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో దామోదర తదితరులు

జగ్గారెడ్డి కుమార్తె నిశ్చితార్థంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: సంగారెడ్డిలో బుధవారం జరిగిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కుమార్తె జయారెడ్డి–గుణచైతన్యరెడ్డి నిశ్చితార్థ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. జపాన్ పర్యటన ముగించుకుని శంషాబాద్ ఎయిర్ పోర్టు నుంచి నేరుగా రోడ్డు మార్గం ద్వారా సంగారెడ్డికి చేరుకున్న రేవంత్‌రెడ్డి ముందుగా రాంనగర్‌లో ఉన్న రామాలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం నిశ్చితార్థ కార్యక్రమానికి చేరుకుని కాబోయే వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డికి జగ్గారెడ్డితోపాటు, జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహలు పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు. ఈ నిశ్చితార్థ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డివెంకట్‌రెడ్డి, కొండా సురేఖ, ఎంపీ సురేశ్ షెట్కార్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

తూకంలో మోసాలకు పాల్పడితే చర్యలు

అదనపు కలెక్టర్ నగేష్

కౌడిపల్లి(నర్సాపూర్): ధాన్యం తూకంలో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ నగేష్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని మహమ్మద్‌నగర్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా ధాన్యం నాణ్యత, తేమశాతం, తూకం పరిశీలించారు. అన ంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయా లని నిర్వాహకులను ఆదేశించారు. వాతావరణ మార్పుల కారణంగా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులు కొనుగోలు కేంద్రానికి నాణ్యమైన ధాన్యం తీసుకువచ్చి గిట్టుబాటు ధర పొందాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యం త్వరగా రైస్‌మిల్లులకు తరలించాలన్నారు. రిజిస్టర్లు సక్రమంగా రాయాలని రైతుల ఫోన్ నంబర్, బ్యాంక్ అకౌంట్ ఇతర ధ్రువపత్రాలు సరిగా తీసుకొని డబ్బులు త్వరగా జమయ్యేలా చూడాలని సిబ్బందికి చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయులు, ఆర్ఐ శ్రీహరి, రైతులు పాల్గొన్నారు.

రజతోత్సవం.. సమాయత్తం

బీఆర్‌ఎస్ సభకు భారీ సన్నాహాలు

- గులాబీ శ్రేణుల్లో ఉత్సాహం
- ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి 2లక్షల మందిని తరలించేందుకు కసరత్తు
- సమీక్షలు, టెలికాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తున్న హరీశ్‌రావు
- సిద్దిపేట నుంచి పాదయాత్రగా యువత



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, నాయకులు

సాక్షి, సిద్దిపేట: బీఆర్‌ఎస్ రజతోత్సవ వేడుకలకు తరలేందుకు మెతుకుసీమ గులాబీ శ్రేణులు సిద్ధమవుతున్నారు. బీఆర్‌ఎస్ (టీఆర్‌ఎస్) 24 ఏళ్లు పూర్తి చేసుకుని ఈ నెల 27న 25 ఏటా అడుగుపెడుతున్న సందర్భంగా హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో రజతోత్సవ భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నారు. ఇందుకోసం ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి దాదాపు 2లక్షల మంది గులాబీ దండును తరలించేందుకు సమాయత్తం మవుతున్నారు. ఇప్పటికే ఆయా నియోజకవర్గాల్లో సన్నాహక సమావేశాలను నిర్వహించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సమీక్షలను, టెలికాన్ఫరెన్స్‌లను నిర్వహిస్తూ కసరత్తు చేస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి భారీగా తరలివెళ్లి ఉద్యమాల గడ్డ అని మరోమారు సత్తా చాటేందుకు స్థానిక గులాబీ నేతలు ప్రత్యేక దృష్టి పెట్టారు.

ముమ్మరంగా ఏర్పాట్లు

ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి దాదాపు 2లక్షల మందికి పైగా సభకు వెళ్లేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. సిద్దిపేట నియోజకవర్గంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు సన్నాహక సమావేశం నిర్వహించారు. నాయకులకు పలు బాధ్యతలను అప్పగించారు. గజ్వేల్ నుంచి గులాబీ దండును తరలించే పనిలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ప్రతాప్ రెడ్డి, మాదాసు శ్రీనివాస్‌లు దృష్టి సారించారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఇప్పటికే సన్నాహక సమావేశం నిర్వహించారు. సభకు తరలేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. హుస్నాబాద్ నియోజకవర్గం పరిధిలోనే సభ జరుగుతుండటంతో ఎక్కువ మందిని తరలించేందుకు ప్రత్యేక దృష్టిపెట్టారు. అలాగే మెదక్, సంగారెడ్డి, నర్సాపూర్, పటాన్‌చెరు, జహీరాబాద్, నారాయణఖేడ్, ఆందోల్ నుంచి సైతం జన సమీకరణ కోసం ఏర్పాట్లు చేస్తున్నారు.

జోరుగా వాల్ రైటింగ్

ఎల్కతుర్తి రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కోరుతూ పలువురు బీఆర్‌ఎస్ నేతలు ప్రధాన రహదారుల వెంట వాల్‌రైటింగ్ రాయించారు. అలాగే పలువురు బీఆర్‌ఎస్ నేతలు వాల్ పోస్టర్లను రూపొందించి అతికించారు. స్థానిక సంస్థల్లో పోటీ చేయాలనుకునే నాయకులు ఉత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారు.

తరలివెళ్దాం రండి..

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక: బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు భారీగా తరలిరావాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం సభ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భావం కోసం జరిగిన ఉద్యమంలో దుబ్బాక నియోజకవర్గం క్రియాశీలక పాత్ర పోషించిందన్నారు. కనీవిని ఎరుగని స్థాయిలో జరుగనున్న రజతోత్సవ సభకు నియోజకవర్గం నుంచి 15 వేలకు పైగా క్రియాశీలక కార్యకర్తలు హాజరుఅవుతారన్నారు. సభకు సంబంధించి ఇప్పటికే నియోజకవర్గంలోని కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించి తగిన ఏర్పాట్లపై చర్చించామన్నారు కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తగ్గిన రిజిస్ట్రేషన్ల ఆదాయం

2024-25లో రూ. 26 లక్షలు పడిపోయిన రాబడి

- డాక్యుమెంట్ల సంఖ్య కూడా స్వల్పంగా తగ్గుముఖం
- రియల్‌ఎస్టేట్ రంగం సంక్షోభమే కారణమంటున్న అధికారులు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 16 ఎస్ఆర్ఓ కార్యాలయాలు



సంగారెడ్డిలోని జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయం

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: జిల్లాలో రిజిస్ట్రేషన్ల ద్వారా వచ్చే ఆదాయం స్వల్పంగా తగ్గింది. అలాగే రిజిస్ట్రేషన్ల సంఖ్య కూడా కొంతమేరకు పడిపోయింది. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా పరిశీలిస్తే 2023-24 ఆర్థిక సంవత్సరంతో పోల్చితే 2024-25 ఆర్థిక ఏడాదిలో రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వ ఖజానాకు వచ్చే ఆదాయంలో రూ.25.74 లక్షలు తగ్గింది. 2023-24లో మొత్తం 1.29 లక్షల డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ కాగా ప్రభుత్వ ఖజానాకు రూ. 1,135.19 కోట్ల ఆదాయం వచ్చింది. 2024-24లో 1.13 లక్షల డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ కాగా, 1,109.45 కోట్లు మాత్రమే ప్రభుత్వ ఖజానాకు జమ అయింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 16 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. సర్కారుకు ప్రధాన ఆదాయ వనరుల్లో ఈ రిజిస్ట్రేషన్ల ఆదాయం ఎంతో కీలకమైంది. రిజిస్ట్రేషన్ చార్జీలతోపాటు, స్టాంప్ డ్యూటీ, ట్రాన్స్‌ఫర్ డ్యూటీ కింద ప్రభుత్వానికి పెద్ద ఎత్తున ఆదాయం లభిస్తుంది. రిజిస్ట్రేషన్ ఆస్తి విలువలో సుమారు 7.5% మొత్తాన్ని ఈ రిజిస్ట్రేషన్ చార్జీల కింద ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఏటా రిజిస్ట్రేషన్ల ఆదాయం పెరుగుతూ వస్తుండగా... ఇటీవల ముగిసిన ఆర్థిక సంవత్సరంలో మాత్రం ఆదాయం పడిపోవడం గమనార్హం.

అనధికారిక లే అవుట్ రిజిస్ట్రేషన్లపై నిషేధంతో..

అనధికారిక లేఅవుట్‌లలోని స్థలాలను రిజిస్ట్రేషన్లను చేయకూడదని ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖను ఆదేశించిన విషయం విదితమే. ఇది కూడా రిజిస్ట్రేషన్ల సంఖ్య పడిపోవడానికి ప్రధాన కారణమని ఆశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఇలా రిజిస్ట్రేషన్ల ఆదాయం స్వల్పంగా తగ్గడానికి పలు కారణాలున్నాయని చెబుతున్నారు.

రియల్ రంగం కుదేలే కారణం!

రియల్ ఎస్టేట్ రంగం కుదేలైంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వచ్చిన మార్పుల ప్రభావం ఈ రంగంపై తీవ్రంగా పడిన సంగతి తెలిసిందే. దీంతో రిజిస్ట్రేషన్ల ఆదాయం ఏడాదికేడాది పెరగాల్సింది పోయి తగ్గుముఖం పట్టింది. ఇందుకు ఈ రంగం సంక్షోభమే ప్రధాన కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సంగారెడ్డితో పాటు, మెదక్, సిద్దిపేట జిల్లాలో హైదరాబాద్ నగరానికి ఆనుకుని ఉన్నాయి. ఇక్కడ రియల్ ఎస్టేట్ వెంచర్లు పెద్ద ఎత్తున వెలిశాయి. వెంచర్లలో నివాస స్థలాల క్రయవిక్రయాలు చాలా మట్టుకు నిలిచిపోయాయి. కొత్తగా ఏర్పాట్లు చేస్తున్న వెంచర్ల సంఖ్య నామమాత్రంగానే ఉంటోంది. ఉన్న వెంచర్లలోనే నివాస స్థలాలను కొనుగోలు చేసే నాథుడే లేకుండా పోయారు. దీంతో చాలా వెంచర్లలో పిచ్చిమొక్కలు మొలుస్తున్నాయి. అలాగే ఈ వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు తమ అవసరాల కోసం విక్రయిద్దామంటే కూడా కొనుగోలుదారులు లేకుండా పోయారు. సెకండ్ సేల్ కూడా లేకపోవడంతో రిజిస్ట్రేషన్ల సంఖ్య పడిపోయింది. దీనికితోడు రియల్ వ్యాపారులు నివాస స్థలాల రేట్లను విపరీతంగా పెంచడంతో సామాన్యులు ప్లాట్లను కొనుగోలు చేసే పరిస్థితి లేకుండా పోయింది. అలాగే అపార్టుమెంట్లు, ఇతర ఆస్తుల క్రయవిక్రయాలు కూడా పడిపోయాయి. ఇలా రియల్ రంగం సంక్షోభం ప్రభావం రిజిస్ట్రేషన్ల ఆదాయంపై స్పష్టంగా కనిపిస్తోంది.

క్లుప్తంగా

చీటింగ్ కేసులో అఘోరీ రిమాండ్

- లింగ నిర్ధారణ పరీక్షలకు నిరాకరణ
- తిరిగి కోర్టుకు పంపిన అధికారులు

సంగారెడ్డి టౌన్: ఓ చీటింగ్ కేసులో అఘోరీని బుధవారం చేవెళ్ల కోర్టులో న్యాయమూర్తి ముందు హాజరు పర్చగా 14 రోజుల రిమాండ్ విధించారు. దీంతో సంగారెడ్డి జిల్లాలోని కంది సెంట్రల్ జైలుకు తరలించారు. అయితే ఇక్కడ జైలు అధికారులకు అఘోరీని ఏ బారక్‌లో ఉంచాలో అనే టెన్షన్ మొదలైంది. అయితే లింగ నిర్ధారణ పరీక్షలకు నిరాకరించడంతో తిరిగి చేవెళ్ల కోర్టుకు పంపించినట్లు జైలు పర్యవేక్షకులు సంతోష్ రాయ్ తెలిపారు.

పుస్తక పఠనంతో మేధో సంపత్తి

గజ్వేల్‌రూరల్: పుస్తక పఠనంతోనే మేధో సంపత్తి పెరుగుతుందని గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖత్ అంజుమ్ పేర్కొన్నారు. పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రపంచ పుస్తక కాపీరైట్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ డాక్టర్ వి.వెంకటేశ్వర్లు, వర్తమాన రచయిత డాక్టర్ మహేందర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ గణపతిరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బొంతపల్లిలో ఇరు వర్గాల ఘర్షణ

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండల కేంద్రంలో విగ్రహ ధ్వంసం చేసిన ఘటన నేపథ్యంలో పలు ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లి ప్రధాన రహదారిపై కారులో వెళ్తున్న ఓ వర్గానికి చెందినవారు రెచ్చగొట్టేలా నినాదాలు చేయడంతో మరో వర్గానికి చెందిన వ్యక్తి దాడికి పాల్పడ్డారు. దీంతో స్థానికంగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాల వారికి నచ్చజెప్పి వారిని శాంతింపచేశారు. మరో వర్గం విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రోడ్డుపై ధర్నా చేయడంతో కొద్దిసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.

ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి ఆయిల్ చోరీ



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

దుబ్బాకటౌన్: రాయపోల్ మండలం బేగంపేట గ్రామంలో మల్కాపూర్ రోడ్డులోని రైల్వే బ్రిడ్జి వద్ద గల వ్యవసాయ పొలంలో మంగళవారం అర్ధరాత్రి దొంగలు ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టారు. దానిలోని కాయిల్స్, ఆయిల్‌ను దుండగులు ఎత్తుకెళ్లారు. ఇది గమనించిన రైతులు పోలీసులకు విద్యుత్, అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. సుమారు వాటి విలువ రూ. 50 వేల విలువ ఉంటుందని అధికారులు తెలిపారు. రైతు మల్లమ్మ ఫిర్యాదు మేరకు బేగంపేట ఎస్సై మహిపాల్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నా భర్త ఆచూకీ తెలుపండి

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని గంగాపూర్ గ్రామానికి చెందిన శశికళ తన భర్త కనిపించడం లేదని బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కొన్ని రోజులుగా ఆమె భర్త మహేశ్‌తో గొడవపడి పుట్టింటికి వెళ్లింది. అయితే ఈ క్రమంలో చాకలి గోపాల్, బండి శోభలు కలిసి శశికళ అత్తమ్మ(64)ను మార్చి 25న బంగారు ఆభరణాల కోసం ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లి హత్య చేసినట్లు పోలీసులు స్వగ్రామానికి వచ్చారు. దీంతో తన భర్త ఆచూకీ కనిపెట్టాలని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మందుబాబులకు జరిమానా

సంగారెడ్డి క్రైమ్: డ్రంకన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా న్యాయస్థానం జరిమానా విధించింది. సంగారెడ్డి పట్టణ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం అర్ధరాత్రి పాత బస్టాండ్‌వద్ద, జాతీయ రహదారి, బైపాస్‌లోని గుర్రపు బొమ్మ వద్ద నిర్వహించిన డ్రంకన్ అండ్ డ్రైవ్‌లో తనిఖీల్లో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. బుధవారం వీరిని సంగారెడ్డి జిల్లా న్యాయస్థానంలో హాజరుపరచగా జిల్లా అదనపు న్యాయమూర్తి షకీల్ అహ్మద్ సిద్దిఖీ ఒకరికి రూ.2వేలు, మిగతా నలుగురికి రూ.1,500 చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు వెల్లడించారు.

వాన నీటిని ఒడిసిపట్టేందుకు..

జిల్లాకు కొత్త వాటర్‌షెడ్ పథకం

- పిచెర్యాగడి ప్రాజెక్టు కింద 8 గ్రామాల ఎంపిక
- భూగర్భ జలాలు తక్కువగా ఉన్న గ్రామాలకు చోటు
- రూ.10.58 కోట్ల నిధులు మంజూరు
- 4,733 హెక్టార్లలో పనులు
- మూడు శాతం మాత్రమే జరిగిన పనులు



జహీరాబాద్: సంగారెడ్డి జిల్లాకు ప్రధానమంత్రి కృషి సించాయి యోజన 2.0 కింద వాటర్‌షెడ్ పథకం మంజూరైంది. ఈ పథకాన్ని అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులను కేటాయిస్తారు. జిల్లాకు మంజూరైన పిచెర్యాగడి వాటర్‌షెడ్ ప్రాజెక్టు కింద 8 గ్రామాలను ఎంపిక చేశారు. అత్యంత తక్కువగా భూగర్భ జలాలు ఉన్నట్లు జలవనరుల శాఖ గుర్తించిన ప్రాంతాలను వాటర్‌షెడ్ పథకం కోసం ఎంపిక చేశారు. ఇక్కడ వాననీటిని ఒడిసిపట్టి భూగర్భ జలవనరులను పెంచి కరువును పారద్రోలనున్నారు.

ఈ ప్రాజెక్టు కింద జహీరాబాద్ నియోజకవర్గంలోని కోహీర్ మండల పరిధిలోని పిచెర్యాగడి, బడంపేట, పర్శపల్లి, సజ్జాపూర్, కొత్తూర్(కె), ఖానాపూర్, మాచిరెడ్డిపల్లి, రాజనెల్లి గ్రామాల్లో భూగర్భ జలాలు నామమాత్రంగానే ఉన్నాయి. ఆ గ్రామాల్లో భూగర్భ జలాలను పెంచేందుకు వీలుగా వాటర్‌షెడ్ పనులను చేపట్టేందుకు ప్రతిపాదించారు. 2021–22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మంజూరు కావాల్సిన ప్రాజెక్టుకు ఆలస్యంగా 2024లో మంజూరైంది. ఆరు నెలల పాటు డిటేల్డ్ ప్రాజెక్టు రిపోర్టును తయారు చేసి ప్రభుత్వానికి అందజేశారు. ప్రాజెక్టును పూర్తి చేసేందుకు రూ.10.58 కోట్ల నిధులు మంజూరు చేశారు. ఈ పథకం కింద 4,733 హెక్టార్ల భూమిలో వాటర్‌షెడ్ పనులను చేపట్టేందుకు గుర్తించారు. ప్రాజెక్టు మంజూరైనందున ఇప్పటి వరకు ప్రజల భాగస్వామ్యంతో మూడు శాతం మేర పనులు చేశారు. పర్శపల్లిలో 6, సజ్జాపూర్‌లో 3 శాతం మట్టి పర్క్యులేషన్ ట్యాంకుల పనులు కొనసాగుతున్నాయి. వాటర్‌షెడ్ పనుల కోసం 49 శాతం నిధులు కేటాయిస్తారు. ఈ నిధులతో గుట్టలపై మట్టి కట్టలు వేసి వర్షపునీరు ఎక్కడికక్కడే ఇంకిపోయేలా చర్యలు చేపడతారు. మిగిలిన నీరు కూడా ఇంకిపోయేందుకు కందకాలను, మట్టి సర్క్యులేషన్ ట్యాంకులను నిర్మిస్తారు. వర్షం నీరు ఎక్కడికక్కడే ఇంకిపోయి భూగర్భ జలాలు పెంచేందుకు వీలుగా వాటర్‌షెడ్ పథకం ఉపయోగపడుతుంది.

మంత్రి ఆదేశాలతో పనుల్లో వేగం



వాటర్‌షెడ్ అమలుపై స్వయం సహాయక సంఘం మహిళా అధ్యక్షురాలు భాగ్యమ్మతో మాట్లాడుతున్న మంత్రి దామోదర

పిచెర్యాగడికి వాటర్‌షెడ్ ప్రాజెక్టు పథకం మంజూరైనా ఇప్పటి వరకు నిధుల కేటాయింపులు లేకపోవడంతో మూడు శాతం మాత్రమే పనులు జరిగాయి. చేసిన పనులకు ఇంకా చెల్లింపులు జరగలేదు. శనివారం పిచెర్యాగడి గ్రామంలో ఏర్పాటు చేసిన వాటర్‌షెడ్ కార్యక్రమానికి వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎంపీ సురేశ్ శెట్కార్, సెట్విన్ చైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాలకు రూ.1.56కోట్ల చెక్కును ఉపాధి కోసం అందజేశారు. మంత్రి కార్యక్రమంతో నిధులు విడుదలై వాటర్‌షెడ్ పనుల్లో వేగం పెరిగే అవకాశం ఉందన్న అభిప్రాయం రైతులు, లబ్ధిదారులు వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు అవసరమైన పరికరాలకు నిధులు..

సమగ్ర గ్రామీణాభివృద్ధిని సాధించి, ఉత్పాదకత పెంచేందుకు వీలుగా రైతులకు అవసరమైన పరికరాలను అందించేందుకు వీలుగా 15 శాతం నిధులను కేటాయిస్తారు. మరో 15 శాతం నిధులతో పేద, నిరుపేద కుటుంబాల జీవన ప్రమాణ స్థాయిని పెంచేందుకు గ్రామాల్లో ఉన్న సంఘాల ద్వారా అమలు చేస్తారు. ముఖ్యంగా స్వయం ఉపాధి, వ్యవసాయ ఆధారిత జీవనోపాధి వ్యవసాయేతర ఉపాధిని ఈ పథకం కింద కల్పిస్తారు.



వాటర్‌షెడ్ పథకం కింద చేపట్టిన కమ్యూనిటీ హాల్

ఉసురు తీసిన కుటుంబ కలహాలు

పెట్రోలు పోసుకొని ఆత్మహత్య



శ్రీకాంత్(ఫైల్)

పాపన్నపేట(మెదక్): కుటుంబ సమస్యలు భరించలేక పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్న యువకుడు చికిత్స పొందుతూ బుధవారం మరణించాడు. ఈ ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం ... కొడుపాక గ్రామానికి చెందిన అవుసుల శ్రీకాంత్ (26) నార్సింగి గ్రామంలో బంగారం దుకాణం నిర్వహిస్తున్నాడు. అతడికి ఆరేళ్ల క్రితం బాచుపల్లికి చెందిన లావణ్యతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అయితే తరచుగా ఇంట్లో గొడవలు జరుగుతుండేవి. ఈ నెల 21న భార్య, అతని తల్లికి మధ్య గొడవ జరిగింది. దీంతో ఎవరిని ఏమనలేక , బయటకు వెళ్లిన శ్రీకాంత్ పెట్రోల్ తీసుకొని వచ్చి ఒంటిపై పోసుకొని నిప్పంటించుకున్నాడు. వెంటనే అతన్ని మెదక్‌కు, అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మరణించాడు. భార్య లావణ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యానికి బానిసై ..

సంగారెడ్డి క్రైమ్: మద్యానికి బానిసై వ్యక్తి మృతి చెందిన ఘటన పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.పట్టణ సీఐ రమేశ్ కథనం ప్రకారం... పట్టణంలోని శివాజీనగర్‌కు చెందిన మార్కంటి దేవదాసు (50), బతుకుదెరువు కోసం కుటుంబంతో కలిసి మూడేళ్ల క్రితం మహారాష్ట్ర నుంచి పట్టణానికి వచ్చి, కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడికి భార్య లక్ష్మీభాయి, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నాడు. బుధవారం ఉదయం భార్య లక్ష్మీభాయి బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లింది. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఇంటికి వచ్చి చూడగా దేవదాసు తన గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని విగతజీవిగా కనిపించాడు. కొన్ని నెలలుగా మద్యానికి బానిసై సరిగా పని చేయడం లేదని కుటుంబీకులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో గడ్డి మందు తాగి..

సిద్దిపేటకమాన్: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. వన్ టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని గ్రీన్ కాలనీకి చెందిన నర్సింహారెడ్డి టింబర్ డిపో నిర్వహిస్తున్నాడు. అతడు వ్యాపార నిర్వహణ కోసం అవసరాల నిమిత్తం చిట్ ఫండ్‌లలో, తెలిసిన వారి వద్ద అప్పులు చేశాడు. అప్పు ఇచ్చిన వారి వేధింపులు భరించలేక, మానసికంగా ఇబ్బంది పడుతూ టింబర్ డిపోలో మంగళవారం గడ్డి మందు తాగాడు. గమనించిన అతడి కుమారుడు వెంటనే సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కుమారుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వివాహిత మృతి



రావుల స్వప్న

నారాయణఖేడ్: ఉతికిన బట్టలు ఆరవేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై మహిళ మృతి చెందింది. ఈ ఘటన నారాయణఖేడ్ మండలం హుంక్రాన (జి) గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి థనం ప్రకారం.. ఖేడ్ మండలం హుంక్రానా(జి) గ్రామానికి చెందిన రావుల స్వప్న (30) బుధవారం సాయంత్రం ఇంట్లో దుస్తులు ఉతికి ఆవరణలో ఆరబెట్టడానికి కట్టిన పాత టీవీ కేబుల్ తీగపై దుస్తులను ఆరవేస్తూ విద్యుదాఘాతానికి గురై అరుస్తూ కిందపడిపోయింది. కుటుంబీకులు ఆమెను ఖేడ్ ప్రాంతీయ ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలికి భర్త రావుల హన్మారెడ్డి, ఈమధ్యే ఇంటర్ ప్రథమ సంవత్సరం పూర్తిచేసుకున్న కుమారుడు సాయి చరణ్ రెడ్డి, 8వ తరగతి పూర్తిచేసుకున్న కూతురు భార్గవి ఉన్నారు. దుస్తులు ఆరవేయడానికి కట్టిన కేబుల్ తీగకు వైర్లు తేలిన విద్యుత్తు తీగ తగిలి విద్యుదాఘాతతానికి గురైనట్లు భావిస్తున్నారు. స్వప్న మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

కుదిరిన సయోధ్య



చెరువులో చేపలు పడుతున్న ముదిరాజ్‌లు

- ఖాజీపూర్‌లో చేపల చెరువు గొడవ
- 30 ఏళ్లుగా ఇరువర్గాల్లో విభేదాలు
- చేపలు పట్టే క్రమంలో మోహరించిన పోలీసు బలగాలు
- గ్రామసభ ద్వారా కుదిరిన ఒప్పందం



సంతోషం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

మిరుదొడ్డి(దుబ్బాక): ముప్పై ఏళ్లుగా చేపల చెరువు విషయంలో గ్రామస్తులకు, ముదిరాజ్ కులస్తులకు జరుగుతున్న విభేదాలకు పరిష్కారం లభించింది. ఇరు వర్గాల మధ్య పచ్చగడ్డి వేస్తే బగ్గుమనే స్థాయిలో ఉన్న సమస్యకు గ్రామ సభలో పోలీసులు పరిష్కారం చూపి సయోధ్య కుదిర్చారు. వివరాలు ఇలా ఉన్నాయి. అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని ఖాజీపూర్ పెద్ద చెరువులో చేపలు పట్టే విషయంలో ముదిరాజ్ కులస్తులకు, గ్రామస్తులకు మధ్య విభేదాలు చోటు చేసుకునేవి. చెరువులో పట్టిన చేపలతో వచ్చే ఆదాయాన్ని గ్రామాభివృద్ధికి కేటాయించాలని గ్రామస్తులు తీర్మానించారు. చేపలు పట్టి ఉపాధి పొందే హక్కు తమదేనని ముదిరాజ్ కులస్తులు పట్టుబడుతున్నారు. దీంతో ముదిరాజ్ కులస్తులకు, గ్రామస్తులకు మధ్య విభేదాలు చోటు చేసుకునేవి. గత ఏడాది గ్రామంలోని అన్ని కులాలు కలిసి ముదిరాజ్ కుటుంబాలను గ్రామంలో సహాయ నిరాకరణ విధించారు. దీంతో వారు కోర్టును ఆశ్రయించగా వారికే చెరువులో చేపలు పట్టే సర్వహక్కులు ఉన్నాయని తీర్పు వెలువరించింది. దీంతో ఖాజీపూర్‌లో మత్స్య సహకార సొసైటీ పేరుతో ఉత్తర్వులు సైతం జారీ చేసింది. ఈ నేపథ్యంలో ముదిరాజ్ కులస్తులు బుధవారం చెరువులో చేపలు పట్టడానికి సమాయత్తం అవుతుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. విషయం పోలీసుల వరకు వెళ్లడంతో సిద్దిపేట ఏసీపీ మధు, నలుగురు సీఐలు, 14 మంది ఎస్ఐలతో పాటు జిల్లా ర్యాపిడ్ పోలీస్ యంత్రాంగాన్ని దింపి గ్రామంలో పెద్ద ఎత్తున పికెట్ ఏర్పాటు చేశారు. గ్రామస్తులను, ముదిరాజ్ కులస్తులను ఒక చోట చేర్చి గ్రామ సభ నిర్వహించారు. ఇరు వర్గాలను సముదాయించి అవగాహన కల్పించారు. చెరువులో చేపలు పట్టగా వచ్చిన ఆదాయంలో 60 శాతం గ్రామాభివృద్ధికి, 40 శాతం ఆదాయం ముదిరాజ్ కులస్తులకు సమకూరే విధంగా ఇరు వర్గాల మధ్య ఒప్పందం కుదిర్చారు. ఇందుకు ఇరు వర్గాలు ఒప్పందాన్ని ఏకగ్రీవంగా తీర్మానించాయి. గ్రామంలో ఎలాంటి ఆందోళన, ఘర్షణ వంటి ఘటనలు చోటు చేసుకోకుండా సామరస్యంగా సమస్యకు పోలీసులు పరిష్కారం చూపడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు హాయిగా ఊపిరి పీల్చుకున్నారు.

దుకాణాల వేలానికి స్పందన కరువు

- 15 షెట్టర్లకు కేవలం మూడింటికి మాత్రమే వేలం
- ఆసక్తి చూపని వ్యాపారస్తులు



వేలం పాట నిర్వహిస్తున్న కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి

దుబ్బాకటౌన్: దుబ్బాక పట్టణంలోని మున్సిపల్ దుకాణ సముదాయాల వేలానికి స్పందన కరువైంది. మున్సిపల్ పరిధిలోని మూడు ప్రదేశాల్లోని దుకాణ సముదాయాల్లో 26 షెట్టర్లు ఉన్నాయి. ఇందులో పోచమ్మ దేవాలయ వద్ద ఉన్న 16 షెట్టర్లలో గతంలో దక్కించుకున్న 11 మంది వ్యాపారస్తులు రెన్యూవల్ చేయించుకున్నారు. కాగా 5 షెట్టర్లకు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం బహిరంగ వేలం పాట నిర్వహించగా అందులో కేవలం మూడు షెట్టర్లకు మాత్రమే వేలం పూర్తయింది. షెట్టర్ నం.3కి దరఖాస్తులే రాకపోవడంతో రెండు షెట్టర్లకు వేలం వాయిదా వేశారు. షెట్టర్ నం.7ను మహ్మద్ నజీర్ రూ.12500, షెట్టర్ నం.14ను గంట రాజు రూ.7500, షెట్టర్ నం.17ను సోమ వినయ్ రూ. 9300 నెలసరి అద్దె ప్రాతిపదికన దక్కించుకున్నారు.

ఆసక్తి చూపని వ్యాపారస్తులు

లాల్ బహదూర్ శాస్త్రి సమీపంలోని 6 షెట్టర్లకు కేవలం ఒకే దరఖాస్తు రావడంతో అధికారులు వేలం వాయిదా వేశారు. అలాగే డబుల్ బెడ్‌రూం సమీపంలోని 4 షెట్టర్లకు కనీసం ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. ఆ ప్రదేశాల్లో వ్యాపార నిర్వహణకు వ్యాపారస్తులు ఆసక్తి చూపడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందగా ముగ్గురు గాయపడ్డారు

లారీని ఢీకొట్టిన మహిళా ఆర్‌ఎంపీ..



మంజుల(ఫైల్)

చేగుంట(తూప్రాన్): ఆగి ఉన్న లారీని స్కూటీ ఢీకొట్టిన ప్రమాదంలో మహిళా ఆర్‌ఎంపీ మృతి చెందింది. ఈ ఘటన చేగుంట మండలం రెడ్డిపల్లి కాలనీ సబ్ స్టేషన్ వద్ద 44వ జాతీయ రహదారిపై బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారానికి చెందిన కమ్మరి మంజుల(45) ఆర్‌ఎంపీగా పని చేస్తున్నారు. ఆమె కామారెడ్డి జిల్లా రామారెడ్డిలో ఉంటున్న తన కూతురు శృతిలయను చూసేందుకు స్కూటీపై వెళ్లింది. బుధవారం తిరుగు ప్రయాణంలో స్కూటీపై వస్తుండగా రెడ్డిపల్లికాలనీ వద్ద జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో ఆమె తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కూతురు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ఆటో..



దెబ్బతిన్న ఆటో



లక్ష్మీ(ఫైల్)

హవేళిఘణాపూర్(మెదక్): ఆగి వున్న లారీని వెనుక నుంచి ఆటో ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా, ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని శాలిపేట గేటు సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... హవేళిఘణాపూర్ మండల పరిధిలోని బూర్గుపల్లికి చెందిన ఆటోలో మెదక్ నుంచి 12 మంది ప్రయాణికులు బూర్గుపల్లి వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో మండల పరిధిలోని శాలిపేట గేటు శివారులోకి రాగానే నిలిచి ఉన్న ఇనుప రాడ్ల లోడ్‌తో ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శాలిపేట గ్రామానికి చెందిన లక్ష్మి(54) అక్కడికక్కడే మృతి చెందింది. డ్రైవర్ రాములుకు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు. కామారెడ్డి జిల్లా గుండారానికి చెందిన పెంటి, శ్రీకాంత్‌లకు మెదక్ ఆస్పత్రిలో చికిత్స నిర్వహిస్తున్నారు. వీరితో పాటు ఉన్న మరో 9 మందికి స్వల్ప గాయాలయ్యాయి. మృతుడికి భర్త యాదగిరి, ఒక కుమారుడు ఉన్నాడు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ సత్యనారాయణ సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన యువకుడు..



సంతోష్

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలంలోని జప్తి శివనూర్ జాతీయ రహదారిపై బైక్ అదుపుతప్పి యువకుడు డివైడర్‌ను ఢీకొట్టి మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. నార్సింగి ఎస్ఐ అహ్మద్ మోహినొద్దీన్ కథనం ప్రకారం... సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట-భూపంల్లి మండలం చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన వల్లెపు సంతోష్(28) తన పెద్దమ్మ కుమారుడు రాజుతో కలిసి మంగళవారం రాత్రి బైక్‌పై గండిమైసమ్మ నుంచి కామారెడ్డికి బయలుదేరారు. మార్గమధ్యలో జప్తిశివనూర్ వద్దకు చేరుకోగానే బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి ప్రమాదానికి గురయ్యారు. వెంటనే రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కామారెడ్డికి తరలిస్తుండగా సంతోష్ మృతి చెందాడు. రాజు కాలు విరగడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన కారు



ముళ్లపొదల్లోకి దూసుకెళ్లిన కారు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ పట్టణ శివారులో ఇటుక బట్టీల దగ్గర బుధవారం రాత్రి ట్రాక్టర్‌ను కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం... హుస్నాబాద్‌నుంచి అక్కన్నపేట వైపు వెళ్తున్న కారు హుస్నాబాద్ వైపు వస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ట్రాక్టర్ ట్రాలీ టైర్లు ఊడిపోయి చెట్ల పొదల్లో పడ్డాయి. కారులో ప్రయాణిస్తున్నవారికి స్వల్ప గాయాలైనట్లు తెలిపారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కమిటీలదే పెత్తనం!

- ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో..
- దరఖాస్తులకు పొంతనలేని కేటాయింపులు




మున్సిపల్ కార్యాలయ భవనం

హుస్నాబాద్: అర్హులైన ప్రతీఒక్కరికీ ఇల్లు కట్టించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు పథకం ప్రవేశపెట్టింది. పైలెట్ ప్రాజెక్టు కింద మండలానికి ఒక గ్రామాన్ని తీసుకొని ఇండ్లు కేటాయించింది. హుస్నాబాద్ మున్సిపాలిటీలో ఇందిరమ్మ ఇండ్లకు 4,542 మంది నిరుపేదలు దరఖాస్తు చేసుకున్నారు. స్థలం ఉండి ఇల్లులేని వారికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం నిబంధన పెట్టింది. దరఖాస్తులకు అనుగుణంగా అధికారులు ఇంటింటి సర్వే చేపట్టారు. అనంతరం ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి వార్డులవారీగా గ్రామసభలు నిర్వహించి అర్హుల పేర్లను గ్రామసభలో ప్రకటించారు. అయితే ఇందిరమ్మ కమిటీ సభ్యులు సూచించిన పేర్లనే ఎంపిక చేయాలని ప్రభుత్వం సూచనప్రాయంగా తెలిపింది. ఇందులో ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3, ఎల్ 4 కేటగిరీలుగా విభజించారు. ఇందులో స్థలం ఉండి ఇల్లు లేనివారి పేర్లను ఎల్ 1 కేటగిరీలో చేర్చారు. స్థలం, ఇల్లు లేనివారిని ఎల్ 2 కేటగిరీలో చేర్చారు.

హుస్నాబాద్‌కు 144 ఇళ్లు కేటాయింపు..

హుస్నాబాద్ పట్టణంలో ఇందిరమ్మ ఇంటి కోసం 4,542 మంది దరఖాస్తు చేసుకోగా.. లబ్ధిదారుల ఎంపికకు అధికారులు సర్వే చేపట్టి నిబంధనలకు అనుగుణంగా అర్హులైన 2,500 మందిపేర్లను ఇందిరమ్మ ఇంటియాప్‌లో నమోదు చేశారు. అయితే ప్రభుత్వం హుస్నాబాద్‌కు కేవలం 144 ఇళ్లు మాత్రమే కేటాయించినట్లు సమాచారం. బూత్‌ల వారీగా ఇళ్లు కేటాయించినట్లు తెలుస్తోంది. బూత్‌ల వారీగా లెక్కిస్తే మొదటి విడతలో ప్రతి బూత్‌కు ఎనిమిది ఇళ్లు కేటాయించారు. రెండో విడతలో ప్రతి బూత్‌కు 11 ఇళ్లు కేటాయించనున్నట్లు తెలుస్తోంది. దరఖాస్తులు 4,542 కాగా, యాప్‌లో నమోదు చేసిన పేర్లు 2500. బూత్‌వారీగా ఎనిమిది ఇళ్ల కోసం అధికారులు రీ సర్వే ప్రారంభించారు. ఈ సర్వే ఈనెల 30 వరకు కొనసాగించి జాబితాను కలెక్టర్‌కు అందించనున్నారు. మేలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఫైనల్ జాబితాను ప్రకటించనున్నారు.

> **రీ సర్వే చేస్తున్నాం..**
>
> 
>
> ఇందిరమ్మ ఇళ్ల ఎంపికకు రీసర్వే చేస్తున్నాం. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుంది. ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఇచ్చిన పేర్లను కూడా పరిగణనలోకి తీసుకొని అర్హులు, అనర్హులను నిర్ధారిస్తాం. స్థలం ఉండి ఇల్లులేని వారికే మొదటి ప్రాధాన్యం ఇస్తాం. ఫైనల్ లిస్టును కలెక్టర్‌కు పంపుతాం. ఆ తర్వాత లబ్ధిదారుల జాబితాను ప్రకటిస్తాం.
>
> – మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్, హుస్నాబాద్

దరఖాస్తులు ఎక్కువ.. కేటాయింపులు తక్కువ

హుస్నాబాద్ నియోజకవర్గంలో ప్రభుత్వం 3500 ఇళ్లు కేటాయించింది. ఇప్పటివరకు అందిన సమాచారం మేరకు బూత్‌లవారీగా ఎనిమిది ఇళ్లు మాత్రమే కేటాయించినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా అక్కన్నపేట మండలానికి 436, భీమదేవరపల్లె మండలానికి 513, చిగురుమామిడి మండలానికి 348, ఎల్కతుర్తి మండలానికి 431, హుస్నాబాద్ రూరల్ మండలానికి 277, హుస్నాబాద్ టౌన్‌కు 144, కోహెడ మండలానికి 478, వేలేరు మండలానికి 40, సైదాపూర్ మండలానికి 589 ఇళ్లు కేటాయించారు. మొత్తంగా 3,256 ఇళ్లు కేటాయించగా.. మిగిలిన ఇళ్లు రిజర్వ్‌లో ఉంచినట్లు తెలుస్తోంది.

ఎవరిది పైచేయి..

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో ఎవరిది పైచేయిగా నిలుస్తోందోనని ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఇందిరమ్మ కమిటీ సభ్యుల దేనని ప్రభుత్వం సూచనప్రాయంగా తెలిపింది. ఇప్పటికే వార్డులవారీగా స్థానిక కమిటీ సభ్యులు లబ్ధిదారుల జాబితాను అధికారులకు అందించినట్లు తెలుస్తున్నది. మున్సిపల్ పరిధిలో మున్సిపల్ కమిషనర్ అర్హులైన జాబితాను తయారు చేసి కలెక్టర్‌కు పంపించనున్నారు. లబ్ధిదారుల ఎంపికలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు సూచించిన పేర్లను ప్రామాణికంగా తీసుకుంటారా? లేదా వారు పంపించిన జాబితాలో ఏమైనా మార్పులు, చేర్పులు చేస్తారా? అనేది చర్చనీయాంశంగా మారింది. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో ఇందిరమ్మ ఇళ్లను గీటురాయిగా చూపించి స్థానిక నేతలు ఎన్నికల బరిలో నిలువనున్నారు. అసలే మంత్రి ఇలాకా.. కమిటీ సభ్యుల మాట చెల్లుబాటు అవుతుందా.. చిక్కులు మాకేందుకని వారిచ్చిన పేర్లను అధికారులు పక్కన బెట్టి మరో జాబితాను తయారు చేస్తారా? అనేది తేలాల్సి ఉంది. ఏదీఏమైనా ఇళ్ల కేటాయింపు, దరఖాస్తుల విషయంలో చా లా తేడా కనిపిస్తోంది. అధికారులు ఏ విధంగా సమన్వయం చేస్తారో వేచి చూడాల్సిందే..